# ఒక శనివారం రాత్రి

వెనుక సముద్రం, ముందు సముద్రం. చుట్టూ సముద్రమే.

అంతా నీళ్ళు- భూమి కప్పేసినట్టు నీళ్ళు.

వేటకాడి వింటి నుంచి వెలువడిన బాణంలా గాలి. జివ్వుమని చప్పుడు. అంతా గాఢాంధకారం. దూరంగా ఆగి ఆగి వినిపించే ఆర్తనాదాలు. ఏదో కూలిపోయిన చప్పుడు. ఎవరిదో ఏడుపు.

రాజయ్య చిన్న కూతుర్ని పొదివిపట్టుకొని కూర్చున్నాడు. పెద్దోడి భుజం మీద చెయ్యివేసి దగ్గరకు లాక్కున్నాడు. మహాలక్ష్మి భర్త చేయి పట్టుకున్కూర్చొని వుంది.

అయిదు నిమిషాలు గడిచేయి.

నీటిమట్టం మరో అడుగు పెరిగింది.

పాక ఎడమపక్క ఒరుగుతోంది.

రాజయ్య చప్పున లేచి కొడుకునీ, కూతుర్నీ చంకనెక్కించుకొని 'పదవే- బైటికి పద, తొందరగా' అంటూ అరచి, ఒక్క అంగలో బైటికొచ్చేడు.

బైటకొచ్చి నోటమాటరానట్టూ నిశ్చేష్టుడయ్యేడు.

వెనుక సముద్రం. ముందు సముద్రం. చుట్టూ నీళ్ళు.

"తొందరగా రావే..." గొంతుచించుకొని అరిచేడు.

గాలి హోరులో గొంతు కీచుమంది. పాక నెమ్మదిగా జరిగి పోతోంది.

కంగారు— భయం.

ఏడుపొస్తోంది.

చేతుల మధ్య ఇద్దరు పిల్లలూ బిగుసుకొన్నారు. 'అమ్మా- అమ్మా' అని ఏడుస్తున్నారు. నడుములోతు నీళ్ళు భుజాల వరకూ వచ్చినయ్.

మహాలక్ష్మిని తీసుకొని పాక తెప్పలాగా కొట్టుకు పోతోంది. అది దురదృష్టవంతురాలు. తరువాత జరిగిన బీభత్సాన్ని చూడటానికి అది లేదు.

ఏడవటానికి సత్తువలేదు-ఏడిస్తే వోదార్చేవాళ్ళులేరు.

ఎటువైపో భూమి వుందని తెలుసు. ఎటువైపుందో తెలీదు. భూమ్మీదకు వెళుతున్నామో-సముద్రంలోకి పోతున్నామో తెలీదు.

అల తరువాత అల.

కొట్టుకొస్తున్న చెట్లు- కట్టెల్లాటిశరీరాలు.

ఈదురు గాలి ఈ చెవిలోంచి ఆ చెవిలోకి కొడ్తోంది.

కాళ్ళక్రింద తుమ్మచెట్లు, భుజాలమీద కన్నవాళ్ళు.

వెనుక నుంచి ఉప్పెన. అల వచ్చినప్పుడల్లా నోటినిండా ఉప్పునీళ్ళు.

"రేయ్ పెద్దోడా-"

"నాయనా-"

"గట్టిగా పట్టుకో-" గాలిలో పక్కవానికే మాటలు వినిపించటం లేదు.

వాడు జుట్టుపట్టుకొన్నాడు. చిన్నది మెడ వాటేసు కుని బల్లిలా అతుక్కుపోయి వుంది. తల్లిని మర్చిపోయేరు... భయం భయం. అంతా భయం. మెరిసినప్పుడల్లా గాలికి పడి పోయిన చెట్లు నీళ్ళ మధ్యలో వికృతంగా కనబడుతున్నాయి. మెరవకపోతే ఆ చిమ్మ చీకట్లో అడుగు దూరంలో వున్నది కూడా కనబడటం లేదు.

రాళ్ళ మీద కాళ్ళు గీరుకుపోతున్నాయి.

చిన్న చిన్న దుంగలూ, చెట్లకొమ్మలూ ప్రవాహంలో వచ్చి వంటికి కొట్టుకొని సముద్రం వైపు పోతున్నాయి. బట్ట లున్నాయో లేదో తెలీదు. ప్రాణాల కే హామీ లేదు. వళ్ళంతా గీరుకుపోయింది.

భుజం నెప్పెస్తోంది.

పెద్దోడు కూర్చున్నవైపు మరీ.

పశువులు-పాములు-మనుష్యులు-అన్నీ శవాలే. బతి కున్నవాళ్ళు అరుస్తున్నారు. కొంపాగోడు వదిలి ఆ నీళ్ళల్లో గమ్యం లేకుండా సాగిపోతున్నారు. భర్తల్నొదులుకున్న భార్యలు, తల్లుల్ని వదిలేసి కొడుకులు- అదో మహా ప్రస్తా నం...

రాజయ్య ఆగి కాలు విదిలించేడు. చుట్టుకున్న పాము

జారి నీళ్ళలోకి కొట్టుకుపోయింది. ఆగినప్పుడు విన్నాడు-

చిన్న శబ్దం. ఓరుసుని వీచేగాలిలో కలిసిపోయి-విడిగా నెమ్మదిగా-దూరం నుంచి చిన్న శబ్దం.

రాజయ్య గ్రహించే లోపులోనే దగ్గిర మీాద నుంచి వెళ్ళిపోయింది.

నిముషంపాటు అయోమయం. ఉక్కిరిబిక్కిరి అయి, దగ్గొచ్చింది. వెళ్ళిన అలతో పాటూ, చెట్టు, చచ్చిన గేదె కొమ్ము డొక్కల్లో తగిలి గీరుకుపోయింది.

ఇంకా యెంత దూరమో తెలీదు. ఎటు వెళ్ళాలో తెలీదు. నడిచేకొద్దీ తరగనట్టూ నీళ్ళు. అంతా నీళ్ళే. మెడ లోతు నీళ్ళు.

"ఒరే పెద్దోడా"

"అయ్యా."

"ఒక్క నిముషం దిగరా– భుజం నొప్పిగా వుంది."

మాట్లాడలేదు. మరింతగట్టిగా తండ్రిని పట్టుకున్నాడు.

చిన్న గుంటలో పడి లేచేసరికి కాలు బెణికింది.

విసుగు, నిస్సత్తువ, తీరం తెలియకపోవటంతో తన మీాద తనకే కసి. జరుగుతున్నదంతా చూస్తోంటే ఏదో చేసెయ్యాలన్న ఆవేశం, ఏమీా చేతకాని తనం. గీరుకుపోయిన మోచేతులు, ఉప్పునీరు తగిలి మండుతున్న అరికాళ్ళు. ఓరు గాలికి చెవులు దిమ్మెక్కి ఆలోచనే రావటంలేదు. కసి. ఎవరి మీాదో తెలీని కసి– దుఃఖం.

"అరె...ఒక క్షణం దిగరా___" గాలిలో మాట విని

పించిందో లేదో తెలీదు. వెనుక నుంచి ఎత్తుగా వచ్చి... ...పెనంలో వేగుతున్న దాన్ని తనతో పాటు తీసుకుపోయే దొొప్పగరిటెలా- సముద్రంలోకి లాక్కుపోయే అల. విసుగెక్కి- బరువెక్కిన భుజాన్ని- క్షణం... క్షణం పాటూ విదిలిస్తే...

వచ్చిన అల వాణ్ని తీసుకుపోవటానికి క్షణం చాలు.

* * *

"బాధపడకు రాజయ్యా. కష్టాలొచ్చినప్పుడే గుండె దిటవు పర్చుకోవాలి."

"నే నేడ్చేది అందుక్కాదు బాబూ. గుండెప్పుడో రాయైపోయింది. కష్టం కూలి కట్టుకున్నది నచ్చినప్పుడే రాయైపోయింది. అందుకే అది, భుజం బరువెక్కగానే పెద్దోణ్ని విదిలించేసింది. అట్లాగే నడుస్తూంటే- న...డు...స్తూ... వుం...టే... ఇంక నడవలేక... బరువు మొయ్యలేక ...రెండో భుజం మీాద కూర్చున్న పాప వీపు మీాద సెయ్యేసేసరికి..." కంఠం రుద్ధమైంది. "ఆ సిన్న పిల్ల కూడా గ్రహించేసింది బాబూ. మెడ వాటేసుకుని అమాయకంగా 'నాన్నా... అన్నయ్యకంటే నేను బరువు లేనుగా' అన్నది బాబూ. పాపిష్టోణ్ణి. చీకటీ- హోరుగాలీ- బతుకు భయం కలిసి మనసుని సంపేసినయయ్యా. దాన్ని వదిలేసి నే నొక్కణ్ణే... నే నొక్కణ్ణే" తల నేల కేసి బాదుకొని ఏడుస్తున్నాడు.